ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండా

- యువతను ఆదరిస్తే శరవేగంగా అభివృద్ధి
- ఇక్కడే ఉద్యోగాలు వచ్చేలా ఐటీ కంపెనీలు తీసుకొస్తా
- తిరుపతి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలి
- ఆత్మీయ సమావేశంలో భూమన అభినయ్‌రెడ్డి



జీవకోనలోని ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా పని చేస్తానని, యువతను ఆదరిస్తే శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని వైఎస్‌ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జీవకోనలో వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు ప్రసాద్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యువతరానికి వన్నెతెచ్చేలా తిరుపతి అభివృద్ధిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న యువనేత అభినయ్‌రెడ్డికి జీవకోన ప్రజలంతా మద్దతుగా ఉంటామని ముక్తకంఠంతో చెప్పారు. జీవకోనలో ఇంతగా రోడ్లు వస్తాయనుకోలేదని, మహా నగరాన్ని తలపించేలా సెంట్రల్ లైట్స్ ఏర్పాటుతో జీవకోన సుందరంగా మారిందని స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండడంతో ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. జగనన్న సహకారంతోనే తిరుపతి నగరాన్ని రూ. 1700 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగలిగామని చెప్పారు. తిరుపతి నగర ప్రజలు సినీగ్లామర్‌కు ఆకర్షితులు కాకుండా అభివృద్ధిని ఆకాంక్షించి తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభినయ్‌రెడ్డి కోరారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించగలమన్న నమ్మకాన్ని తాను నిలబెట్టానని సగర్వంగా చెప్పారు. తిరుపతి జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా అన్ని విధాల అభివృద్ధి చేశామన్నారు. తిరుపతిలో నిర్మించిన 22 మాస్టర్ ప్లాన్ రోడ్లు నగర రూపురేఖలే మార్చేశాయన్నారు. రాష్ట్రంలో జగనన్నను, తిరుపతిలో తనను ఆశీర్వదించాలని కోరారు. నాలుగన్నరేళ్లల్లో జగనన్న చేసిన మంచి చూశారని, తిరిగి అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తారని చెప్పారు. నగరాన్ని కూడా పరిశుభ్రమైన నగరంతోపాటు క్రైం ఫ్రీ సిటీగా కూడా మారుస్తానని హామీ ఇచ్చారు.



తిరుపతి జీవకోనలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరైన ప్రజలు

క్లుప్తంగా

ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో రాస్, తిరుపతి టాటాట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు జరిగాయి. ఎండీపుత్తూరు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 150 మందికి గర్భముఖ, రొమ్ము, నోటి క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 30 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు ప్రతి 6 నెలలకు ఒకసారి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనప్రియ, రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, డాక్టర్లు వెంకయ్య బాబు, రెడ్డికుమారి, ఫీల్డ్ అధికారి వెంకట్‌కుమార్, ఎంఎస్ కో-ఆర్డినేటర్ మునిపార్థసారథి, రేవతి, తిరుపాల్, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం జిల్లా మేనేజర్ హేమంత్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే రావాలి..



ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

నాగలాపురం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టేలా చూడాలని నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాపురం సచివాలయంలో సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, సర్పంచ్ చిన్నదొరై సుధా, మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, ఎంపీపీ సింధు ఆధ్వర్యంలో మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బూత్ కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తిని గెలిపించడానికి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. కృష్ణాపురం సర్పంచ్ మహేంద్రన్, నాయకులు కులశేఖర్, దేశప్పన్, ఉదయ్ కుమార్, ధనరాజ్, హరిబాబు, దేశన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

వరదయ్యపాళెం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.. సోమవారం శ్రీసిటీ పరిధిలోని చిలమత్తూరు, కొల్లడం, ఇరుగుళం గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు హెచ్చరికగా కేంద్ర బలగాలు, పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు గౌస్‌పీర్, శ్రీకాంత్,సిబ్బంది పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యులకు సన్మానం



రాముగుప్త, సుబ్బారావుకు సన్మానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక స్థానం కలిపించారు. ఈ నేపథ్యంలో రాముగుప్తా, జూలుగంటి సుబ్బారావును ఆర్యవైశ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జూలుగంటి మురళిమోహన్‌గుప్తా, భార్గవమూర్తి, గుర్రప్పశెట్టి తదితరులు ఉన్నారు.

వెంకటగిరి పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

తిరుపతి క్రైమ్: వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక గృహహింస, వరకట్న వేధింపులు కేసులో నేరస్తుడికి జైలు శిక్ష, పడడంతో ఆ కేసు నిరూపణకు కృషి చేసిన వెంకటగిరి పోలీసులు, ఏపీపీలను జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ అభినందించారు. 2017వ సంవత్సరంలో వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో శ్రీకాళహస్తి మండలం, అక్కుర్తి గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డిని ముద్దాయిగా నిర్ధారించి వెంకటగిరి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసు నిరూపణకు అహర్నిశలు కృషిచేసిన దర్యాప్తు అధికారి సుధాకర్ రెడ్డి, ఏపీపీ ప్రకృతి కుమార్, వెంకటగిరి సీఐ సంగమేశ్వర రావు, వెంకటగిరి పోలీస్ స్టేషన్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ సుందరయ్య, సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ మహమ్మద్ బాబా, సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ అభినందించారు.

పొరపాట్లకు తావివ్వకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

- పూర్తి అవగాహన అవసరం
- సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహిద్దాం

తిరుపతి అర్బన్: పొరపాట్లు చేయడం, తర్వాత సరిదిద్దుకోవడం వద్దు.. ముందే పూర్తి అవగాహన ఉంటే తప్పులు లేకుండా సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించగలమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలింగ్ ప్రక్రియ విధులపై అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టర్‌తోపాటు జేసీ ధ్యాన్‌చంద్ర పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తప్పులు లేకుండా పనిచేస్తేనే బాధ్యతగా పనిచేసినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా లోటుపాట్లు లేకుండా పోలింగ్ విధులకు సిద్ధం కావాలని సూచించారు. ఈవీఎంల సీలింగ్ నుంచి మాక్ పోలింగ్ వరకు గత ఎన్నికల కంటే ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయని, వీటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని వెల్లడించారు. నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు సరైన అవగాహన ఉంటే కిందిస్థాయి ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు సక్రమంగా అవగాహన కల్పించగలుగుతారని చెప్పారు. భారత ఎన్నికల సంఘం అందించిన హ్యాండ్ బుక్‌ను తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఎన్నిక కూడా కొత్తగానే ఉంటుందని భావించి పోలింగ్ ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సిద్ధం కావాలన్నారు. ఈవీఎంల పనితీరు, వినియోగం, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల పరిశీలన, బ్యాలెట్ యూనిట్‌లో అభ్యర్థుల పేర్లకు ఎదురుగా ఓటరు నొక్కే బ్లూ బటన్లు ముందస్తు పరిశీలన మొదలైన పోలింగ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలు అప్పగించాల్సిన రిసెప్షన్ సెంటర్ వరకు చేపట్టాల్సిన ప్రతి అంశాన్ని క్లుప్తంగా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని అధికారులు సద్వినియోగం చేసుకొని ఎటువంటి పొరపాట్లు జరగకుండా సజావుగా పోలింగ్ నిర్వహించేలా వారి నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, ఎస్డీసీ మురళి, మాస్టర్ ట్రైనర్లు చంద్రమౌళి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాల మైదానంలో టీటీడీ సీనియర్ పురుష, మహిళ అధికారులకు వివిధ కేటగిరీలవారీగా నడక, బాల్ త్రో, బకెటింగ్ ది బాల్, షాట్ పుట్ తదితర పోటీలు నిర్వహించారు. రింగ్ ఆన్ ది స్టిక్ పోటీల్లో డిప్యూటీ ఈవోలు గోవింద రాజన్ ప్రథమ, సెల్వం ద్వితీయ, చీఫ్ పీఆర్‌ఓ డాక్టర్ టి.రవి తృతీయ స్థానాలు సాధించారు. ఒక కిలోమీటర్ వాక్ పోటీల్లో చంద్రశేఖర్ ప్రథమ, గోవిందరాజన్ ద్వితీయ, వెంకటేశ్వర్లు తృతీయ స్థానాలు సాధించారు. డాక్టర్ రేణు దీక్షిత్ ప్రథమ, రమాదేవి ద్వితీయ, డాక్టర్ కుసుమకుమారి తృతీయ స్థానాలు సాధించారు. షార్ట్ పుట్ పోటీల్లో పార్థసారథి ప్రథమ, పురుషోత్తం ద్వితీయ, మల్లికార్జున ప్రసాద్ తృతీయ స్థానాలు సాధించారు. డాక్టర్ రేణు దీక్షిత్ ప్రథమ, రమాదేవి ద్వితీయ, నారాయణమ్మ తృతీయ స్థానాలు సాధించారు. బాల్ త్రో పోటీల్లో లక్ష్మణ బాబు ప్రథమ, మల్లికార్జున ప్రసాద్ ద్వితీయ, భాస్కర్ రెడ్డి తృతీయ స్థానాలు సాధించారు. బకెటింగ్ ది బాల్ పోటీల్లో లక్ష్మణ్ బాబు ప్రథమ, రామ కోటేశ్వరరావు ద్వితీయ, పురుషోత్తం తృతీయ స్థానాలు సాధించారు. రమాదేవి ప్రథమ, స్నేహలత ద్వితీయ, నారాయణమ్మ తృతీయ స్థానాలు సాధించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



తిరుపతిలో పద్మావతీ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

- టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైమ్: జిల్లాలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్టు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి బాలికోన్నత పాఠశాలను సోమవారం ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడం చేశామని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకుండా పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వేయించామని, పరీక్ష పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు.



ఉపాధ్యాయులు, ఇన్విజిలేటర్లతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

నేటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై శిక్షణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ గ్రంథాలయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీస్ ఆఫ్ కల్చర్ వారి సౌజన్యంతో వర్సిటీలో మంగళవారం నుంచి ఐదు రోజులపాటు పౌర గ్రంథాలయ నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.సురేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో ఆంధ్ర, తెలంగాణా, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన గ్రంథాలయ సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలియజేశారు.

20 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): కాకినాడ జిల్లా, పిఠాపురం శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 20 నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. 19న సాయంత్రం 6 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తారు. 20న ఉదయం 8 నుంచి 8.45 గంటల వరకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మార్చి 21న సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి గరుడ వాహన సేవ జరగనుంది. మార్చి 22, 23, 24 తేదీల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఊంజల్‌సేవ చేపడుతారు. మార్చి 25న ఉదయం 9 నుంచి 10.45 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 5 గంటలకు ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. మార్చి 26న సాయంత్రం 5.30 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి దర్శించుకున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తెలంగాణ ఎమ్మెల్సీ సుంకరరాజు, సినీనటి అనన్య దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



సినీనటి అనన్య

శాటిలైట్ ఫోన్లపై శిక్షణ

తిరుపతి మంగళం: టాస్క్ ఫోర్స్ సిబ్బంది కూంబింగ్ సమయంలో ఉపయోగించే శాటిలైట్ ఫోన్ల వినియోగంపై బీఎస్ఎన్ఎల్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం తిరుపతి కపిల తీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ ఏజీఎం లక్ష్మీనారాయణ శాటిలైట్ ఫోన్ల పనితీరు, వాటిని ఎలా ఉపయోగించాలి, ఎలాంటి ప్రాంతాల్లో వినియోగించాలి, వాటి వల్ల కలిగే ప్రయోజనం తదితరాల పై శిక్షణ ఇచ్చారు. కూబింగ్ చేపట్టే అధికారులతో గ్రూప్ డిష్కషన్ చేపట్టారు. కొన్ని కేస్ స్టడీలను తెలిపారు. తరువాత టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆపరేషనల్ టీమ్‌లతో ఇంటరాక్ట్ అయ్యారు. శాటిలైట్ ఫోన్ల ద్వారా కమ్యూనికేషన్ ఎలా తదితరాలను తెలిపారు. డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ ఐలు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు అవగాహన కలిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

భవన నిర్మాణాలకు బీఓసీ సెస్ కట్టాలి

- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిలో జమ చేయండి
- వెల్లడించిన జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: భవన నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ అప్రూవల్ అయితే తప్పకుండా కార్మికుల సంక్షేమ నిధికి 1శాతం బీఓసీ సెస్ కట్టాల్సిందేనని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కార్మిక శాఖ కన్వీనర్ ఎం.బాలునాయక్ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని విభాగాల ఇంజినీరింగ్ అధికారులు, పే అకౌంట్స్ ఆఫీసర్లు, వర్క్ ఎగ్జిక్యూటివ్ అధికారులు, ప్లానింగ్ అప్రూవల్ అథారిటీ అధికారులు, అడిషనల్ మున్సిపల్ కమిషనర్, పంచాయితీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ తదితరులు హాజరయ్యారు. వారికి డీఆర్వో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి 1శాతం బీఓసీ సెస్ చెల్లించాల్సిన అంశాన్ని వివరించారు. తప్పకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో శ్రీరామ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 28మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. టీవీఎస్-సుందరం లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఈసీఈ, ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిపారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచి రూ.2 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికకావడం సంతోషకరమన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రెటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ కె.జయచంద్ర, ప్లేస్‌మెంట్ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యాపకులు అభినందించారు.

ఉమెన్స్ వింగ్ నూతన కమిటీ ఎంపిక



నగర నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు భువనేశ్వరి

తిరుపతి కల్చరల్: ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ తిరుపతి నగర ఉమెన్స్ వింగ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆ సంస్థ ఉమెన్స్ వింగ్ జిల్లా అధ్యక్షురాలు బి.భువనేశ్వరి ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాణిపాకం మురళి, కె.రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై తిరుపతి నగర ఉమెన్స్ వింగ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షురాలిగా డి.సుబ్బమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎం.తులసి, ఫైనాన్స్ కార్యదర్శిగా యు.కల్పన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి, రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగర పరిధిలో అన్ని ప్రాంతాల ప్రజల సంక్షేమం దిశగా మెడికల్ క్యాంపులు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టి చేయూతనివ్వాలని కోరారు. నూతన కమిటీలను ఎంపిక చేసి మానవ హక్కులపై అవగాహన సదస్సులు చేపడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. తమ ఎంపికకు సహకరించిన జిల్లా, రాష్ట్ర కమిటీ ప్రతినిధులకు నూతనంగా ఎంపికైన నగర కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.

భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదం

భాకరాపేట: భాకరాపేట ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గరికి గాయాలయ్యాయి. భాకరాపేట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నుండి దివ్యాంగుడు సురేష్ ఆరోగ్య పరిస్థితి బాగా లేక పోవడంతో కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి రుయా ఆసుపత్రికి ఆటోలో బయల్దేరాడు. మార్గమధ్యంలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో ఆటో అదుపు తప్పడంతో ఐదడుగులు లోయలోకి జారుకుంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న దివ్యాంగుడు సురేష్, చిన్న పాపమ్మ, మాధవి, ఆటో డ్రైవర్ రెడ్డిరాంతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దివ్యాంగుడు సురేష్ పరిస్థితి విషమంగా ఉంది. గాయపడ్డ వీరందరిని భాకరాపేట 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రైతు చెంతకు వ్యవసాయ విద్యార్థులు


బ్రాహ్మణపట్టులో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తిరుపతి రూరల్: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతుల చెంతకు వెళ్లారు. వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడో రోజు సోమవారం బ్రాహ్మణపట్టు గ్రామంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మినుములు, వేరుశనగ పంటలను, చీనితోటలో అంతర పంటలను పరిశీలించారు. తెగుళ్లు, పేనుబంక, పురుగులను గుర్తించారు. నివారణ చర్యలను రైతులకు వివరించారు. అనంతరంగా పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు వీఎల్ఎన్ రెడ్డి, సరళ, వాణి, ప్రదీప్, యామిని, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

తిరుపతి అర్బన్: ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి అంతా సహకరించాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి సంబంధించి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈఆర్‌ఓలు హెచ్‌ఎం ధ్యానచంద్ర(ఐఏఎస్), అదితి సింగ్(ఐఏఎస్), కోదండ రామిరెడ్డి, చంద్రముని, నిషాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, రవిశంకర్ రెడ్డి, రాంమోహన్, పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పాకాల: దామలచెరువుకు సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కొనుదుల నిశిత తన తండ్రి కొనుదుల చక్రధర్ సంస్మరణార్థం వృద్ధులకు భోజనాలను ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు విజయ్‌బాబు, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ జి.రామయ్య, ధనుంజయ పాల్గొన్నారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మేలు జరిగింది.. మోహిత్‌ను ఆదరించండి

- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం
- తిరుచానూరులో 'మీతోనే.. మీ మోహిత్'కు అపూర్వ ఆదరణ

చంద్రగిరి(తిరుచానూరు): 'జగనన్న ప్రభుత్వంలో ప్రజలు అందరికీ మేలు జరిగింది.. కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ అన్న తేడాలు లేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా వారి ఇంటికి చేరింది. అడగకుండానే అన్నీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయునిగా, జగనన్న స్ఫూర్తితో జనం ముందుకు వచ్చిన మోహిత్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించండి' అంటూ ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి విన్నవించారు. తిరుచానూరు పంచాయతీ లక్ష్మీ నగర్ నుంచి 'మీతోనే..మీ మోహిత్' కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆమె ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మోహిత్ రెడ్డిని ఆదరించి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి పదేళ్లుగా చేసిన మేలును గుర్తు చేస్తూ ఆయన బిడ్డను గెలిపించేందుకు ముందుకు రావాలని కోరారు.

చంద్రగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.978 కోట్లతో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. చెవిరెడ్డి లక్ష్మీ చేస్తున్న విన్నపాలకు మహిళలు స్పందిస్తూ తప్పకుండా మోహిత్‌రెడ్డిని ఆశీర్వదిస్తామని, అడగకుండానే అన్నీ చేస్తూ ప్రజలందరి బాగోగులు చూసుకోవడంలో చెవిరెడ్డిని మించిన నాయకుడు లేడన్న నిజాన్ని మోహిత్‌రెడ్డి గెలుపుతో మరోసారి రుజువు చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో మోహిత్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పెద్ద ఎత్తున యువత చెవిరెడ్డి లక్ష్మి వెంట తిరుగుతూ కరపత్రాలను ప్రతి ఇంటికీ అందజేశారు


తిరుచానూరులో చెవిరెడ్డి లక్ష్మీకి అపూర్వ స్వాగతం పలుకుతున్న మహిళలు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, తిరుచానూరు సర్పంచ్ సతీమణి మధు తదితరులు


మోహిత్‌ను ఆశీర్వదించాలంటూ వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న చెవిరెడ్డి లక్ష్మీ

సంతలో ప్రజలకు ఎమ్మెల్యే భోజనాలు


భోజనాలు వడ్డిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో రైతులు, వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉచితంగా భోజనాలను అందజేశారు. సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా భోజనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారులు భోజనాలకు ఇబ్బందులు పడకూడదని, అందరూ బాగుండాలనే ఉద్దేశంతో రుచికరమైన భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. పాకాలతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. అన్ని సమయాల్లో తమకు అండగా ఉండే ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని, రాబోయే ఎన్నికల్లో వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన

రామచంద్రాపురం: జగనన్న ప్రభుత్వంతోనే జనరంజక పాలన సాధ్యమైందని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చంద్రప్పనాయుడు కండ్రిగ, పిళ్లారికోన, నెత్తకుప్పం హరిజనవాడలో మీతోనే మీ మోహిత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి మోహిత్‌రెడ్డిని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు బీకిరెడ్డి, చంద్రబాబు, యశ్వంత్, భాస్కర్ రాయల్, కేశవులు రెడ్డి పాల్గొన్నారు.


గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

భాకరాపేట: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు చిన్నగొట్టిగల్లు ఎంఈవో సత్యనారాయణ, ఎర్రావారిపాళెం ఎంఈవో బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం చిన్నగొట్టిగల్లు, భాకరాపేట కేంద్రాలుగా 207 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎర్రావారిపాళెం, నెరబైలు, బోడేవాండ్లపల్లె కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 267 మంది విద్యార్థులకు 261 మంది హాజరైనట్లు ఎంఈవో తెలిపారు. ఎర్రావారిపాళెం మండలంలో ఆరుగురు హాజరు కాలేదు.

చంద్రగిరిలో...

చంద్రగిరి: పదో తరగతి పరీక్షలు మండల వ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని 9 సెంటర్లలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 1165 మంది విద్యార్థులు కావాల్సి ఉండగా, 34 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ అధికారులు 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ లలిత కుమారి తెలిపారు.

రామచంద్రాపురం: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 9 గంటలకు అనుమతించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మార్కండేయ నాయుడు, జయవేలు మాట్లాడుతూ మండలంలోని 5 పరీక్షా కేంద్రాల్లో 426 మంది విద్యార్థులకు గాను 414 మంది హాజరైనట్లు చెప్పారు. కేకేవీపురంలో 47 మంది, కమ్మకండ్రిగలో 84 మంది, సొరకాయలపాలెంలో 126 మంది, కుప్పంబాదూరులో 79 మంది, నెత్తకుప్పంలో 78 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో కేకేవీపురంలో ఒకరు, కమ్మకండ్రిగలో ముగ్గురు, కుప్పంబాదూరులో ఒకరు, నెత్తకుప్పంలో ఒకరు, సొరకాయలపాలెంలో ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు.


పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పది పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

పాకాల: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎ, బి సెంటర్లు, దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో సి సెంటర్‌తో కలిపి మొత్తం 3 సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మూడు సెంటర్లలో 482 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు తెలిపారు.

అభివృద్ధిని చూడండి... అన్నని గెలిపించండి

పాకాల: ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని, తన అన్నయ్య తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని దామలచెరువు పంచాయతీ ఎల్లంపల్లి, కట్టకిందపల్లి, కేశవ హరిజనవాడ, కొత్తపల్లి గాండ్లపల్లి, కొత్తపల్లి, కొత్తపల్లి ఒడ్డిపల్లి, కుక్కలపల్లి, కుక్కలపల్లి హరిజనవాడ గ్రామాల్లో గడపగడపకు పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి హర్షిత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని ప్రతీ గ్రామంలో జరిగిన అభివృద్ధిని ఆయన వివరించారు. నవరత్నాలతో ప్రజల్లో జీవితాల్లో వెలుగులు నింపారని, రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే మరొక్కసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి అవసరాలను తీర్చారని పేర్కొన్నారు. తండ్రి బాటలో నడుస్తూ తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేస్తాడని, ప్రజలతోనే తన జీవితాన్ని కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా మోహిత్‌రెడ్డి పోటీ చేస్తున్నాడని, ఆయన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ లోకనాథం, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, పొలిటికల్ ఇన్‌చార్జ్ పులికేశవమూర్తిరెడ్డి, రఘుపతి, ఏఎంసీ చైర్మన్ లింగయ్య, ఎంపీటీసీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

కోడ్ కూసింది... ముసుగు పడింది


చిగురువాడ పంచాయతీలో నేతల విగ్రహానికి తెల్లరంగు ముసుగు వేసిన దృశ్యం



పెరుమాళ్లపల్లిలో...

- ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అమలులోకి కోడ్
- అప్రమత్తమైన నియోజకవర్గ అధికార యంత్రాంగం
- నాయకుల విగ్రహాలకు ముసుగులు, ఫొటోల తొలగింపు

తిరుపతి రూరల్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నేతల ఫొటోలను తొలగించారు. వివిధ ప్రాంతాల్లో దర్శనమిస్తున్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లోని 108 సచివాలయాల పరిధిలో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి హెచ్చరించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఇప్పటికే ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తనిఖీల సమయాల్లో పోలీసులకు సహకరించాలని, ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని చంద్రగిరి డీఎస్పీ తెలిపారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పలు కూడళ్లలో నేతల విగ్రహాలకు ముసుగులు వేయడంతోపాటు ఫ్లెక్సీలను తొలగించారు. ఇప్పటికే భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆయా పార్టీల నాయకులు తొలగించుకోవాలని అధికారులు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో దుకాణాలపై పెట్టిన హోర్డింగ్‌లు తీసేయాలని సూచించారు.

89 రోజులపాటు కోడ్

దాదాపు 89 రోజులపాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. షెడ్యూల్ విడుదలైన శనివారం నుంచి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు 89 రోజులపాటు కోడ్ వర్తించనుంది. కోడ్ అమల్లోకి రాగానే అన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు తొలగించారు.

నియోజకవర్గంలో ఓటర్లు ఇలా...

చంద్రగిరి నియోజకవర్గంలో శనివారం నాటికి ఓటర్ల సంఖ్య 3,08,143కు చేరుకుంది. పోలింగ్ కేంద్రాలు 375 ఉన్నాయి. ఇక ఓట్ల తొలగింపు, బదిలీ, చేర్పులు, మార్పులకు అవకాశం లేదు. ఈమేరకు శనివారం ఈఆర్వో నెట్‌లో ఈ ప్రక్రియ నిలిపివేశారు. కొత్త ఓటు నమోదుకు ఫారం-6 దాఖలు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. నామినేషన్ల ఆఖరు తేదీ పది రోజుల ముందు వరకు దాఖలైన ఫారం-6 దరఖాస్తులను పరిష్కరించి, ఓటు హక్కు కల్పించనున్నారు. ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి ఓటు హక్కు కల్పిస్తారు.

ఇక్కడ ఎన్నికల నిబంధనలు పట్టవా?


నారావారిపల్లి ప్రవేశ మార్గంలో తొలగించని టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన బోర్డు


కందులవారిపల్లిలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తూ దర్శనమిస్తున్న బోర్డు

- ప్రభుత్వ ఆస్తులలో తొలగని టీడీపీ ప్రచార బోర్డులు
- నారావారిపల్లిలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

చంద్రగిరి: దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) నగారాను మోగించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్‌ను అధికారులు పక్కాగా నిర్వహించేందుకు సన్నాహాలను నిర్వహిస్తున్నారు. అయితే చంద్రగిరి మండలంలో మాత్రం ఎన్నికల కోడ్‌తో మాకేం పని అన్న చందంగా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. ప్రచార యావతో ఎన్నికల కోడ్‌ను సైతం విస్మరించి ప్రభుత్వ ఆస్తులతో ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆస్తులలో ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డులు ఉన్నప్పటికి అధికారులు వాటిని తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడెక్కడంటే... : మండల పరిధిలోని నారావారిపల్లి కాలనీ, నారావారిపల్లి, కందులవారిపల్లి హరిజనవాడ, కందులవారిపల్లి, శేషాపురం, భీమవరం, యల్లంపల్లి, మూలపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఆస్తులలో బోర్డులను టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. అయితే వాటిని తొలగించాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో నిబంధనలు గాల్లో దీపంలా మారాయి. దీనిపై ఎంపిడిఓను వివరణ కోరగా.. ఇప్పటికే ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పలు పార్టీలకు సూచించడం జరిగిందని తెలిపారు. స్వచ్ఛందంగా ఆయా పార్టీల బోర్డులను వారే తొలగించాలని, మంగళవారంలోపు తొలగించకుంటే తామే వాటిని తొలగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అభ్యుదయ తత్త్వం అడిగోపుల కవిత్వం



నిలువెత్తు సంతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, వక్తలు

తిరుపతి కల్చరల్: అడిగోపుల వెంకటరత్నం అనర్ఘమైన అభ్యుదయ కవి రత్నమని తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రచయిత అడిగోపుల వెంకటరత్నం రచించిన నిలువెత్తు సంతకం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అంతరాలు, అసమానతలపై అడిగోపుల అసహనం ప్రకటిస్తారని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షురాలు ప్రేమావతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. కవిత్వం సమీక్షించడం సులభం కాదని, కవిత్వాన్ని పూర్తిగా అనుభూతి చెందిన తర్వాతే విమర్శ చేయగలమన్నారు. సామాన్యంగా కనిపించే వస్తువును కూడా జిగేలుమనిపించే రసవేది అడిగోపుల వెంకటరత్నం అని తెలిపారు. ఇప్పటికి 29 కవితా సంపుటాలు ప్రచురించడం అరుదైన విషయమన్నారు. రచయిత కుమారుడు శ్రీకాంత్, ఆముదాల మురళి, టెంకాయల దామోదరం, మల్లేశ్వరరావు, ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు, నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

మోహన్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన భూమన

తిరుపతి మంగళం: సినీ నటుడు, శ్రీవిద్యానికేతన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధినేత మంచు మోహన్‌బాబుకు టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి దుశ్శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం శ్రీవిద్యానికేతన్‌లోని మోహన్‌బాబు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పక్కనే ఉన్న మోహన్‌బాబు తనయుడు సినీహీరో మంచు విష్ణును ఆత్మీయంగా పలకరించారు.



మంచు మోహన్‌బాబును సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన

ఆశా వర్కర్స్ నూతన కమిటీ

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో తిరుపతి నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ నగర అధ్యక్షురాలిగా లక్ష్మీకళ, ప్రధాన కార్యదర్శిగా జె.గంగాదేవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లక్ష్మీ, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి, మంజుల, రేఖ, మునేశ్వరి, అన్నపూర్ణ, సహాయ కార్యదర్శులుగా ధనలక్ష్మి, పరిమళ, వసంత, శైలజ, దేవి, కోశాధికారిగా ఆయేషాతోపాటు 11 మంది కౌన్సిల్ సభ్యులు ఎంపికయ్యారు.

జనరల్ మేనేజర్ పోస్టు నియామకం వాయిదా

తిరుపతి(అలిపిరి): ఎన్నికల కోడ్ కారణంగా టీటీడీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పోస్టు నియామకం వాయిదా వేస్తున్నట్లు టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు అధ్యక్షులు చీర్ల కిరణ్ తెలిపారు. ఈ నెల 20న జరగాల్సిన నియామకాన్ని ఎన్నికల అనంతరం చేపట్టనున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్ నం 9989033100, 9989759044లో సంప్రదించాలని కోరారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్: ఆస్తి కోసం ఒకరిని హత్య చేసిన కేసులో తిరుపతి జిల్లా, వడమాలపేట మండలం, పత్తిపుత్తూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఎస్.మునిశేఖర్‌కు ఏప్రిల్ ఒకటో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు సోమవారం ఆదేశాలు జారీచేశారు. టీటీడీ మాజీ ఉద్యోగి ఎస్.రఘురాం జనవరి 22న మృతి చెందాడు. ఆ మృతిపై అతని అన్న ఎం.ప్రభాకరుడు తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు ఎస్.మునిశేఖర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

తిరుపతి అర్బన్: ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి అంతా సహకరించాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి సంబంధించి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈఆర్‌ఓలు హెచ్‌ఎం ధ్యానచంద్ర(ఐఏఎస్), అదితి సింగ్(ఐఏఎస్), కోదండ రామిరెడ్డి, చంద్రముని, నిషాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, రవిశంకర్ రెడ్డి, రాంమోహన్, పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పది మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న పది మందికి ఒక లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న పది మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో రాస్, తిరుపతి టాటాట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు జరిగాయి. ఎండీపుత్తూరు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 150 మందికి గర్భముఖ, రొమ్ము, నోటి క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 30 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు ప్రతి 6 నెలలకు ఒకసారి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనప్రియ, రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, డాక్టర్లు వెంకయ్య బాబు, రెడ్డికుమారి, ఫీల్డ్ అధికారి వెంకట్‌కుమార్, ఎంఎస్ కో–ఆర్డినేటర్ మునిపార్థసారథి, రేవతి, తిరుపాల్, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం జిల్లా మేనేజర్ హేమంత్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే రావాలి..



ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

నాగలాపురం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టేలా చూడాలని నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాపురం సచివాలయంలో సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, సర్పంచ్ చిన్నదొరై సుధా, మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, ఎంపీపీ సింధు ఆధ్వర్యంలో మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బూత్ కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తిని గెలిపించడానికి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. కృష్ణాపురం సర్పంచ్ మహేంద్రన్, నాయకులు కులశేఖర్, దేశప్పన్, ఉదయ్ కుమార్, ధనరాజ్, హరిబాబు, దేశన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

వరదయ్యపాళెం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.. సోమవారం శ్రీసిటీ పరిధిలోని చిలమత్తూరు, కొల్లడం, ఇరుగుళం గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు హెచ్చరికగా కేంద్ర బలగాలు, పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు గౌస్‌పీర్, శ్రీకాంత్,సిబ్బంది పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యులకు సన్మానం



రాముగుప్త, సుబ్బారావుకు సన్మానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలో రాముగుప్తా, జూలుగంటి సుబ్బారావును ఆర్యవైశ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జూలుగంటి మురళీమోహన్‌గుప్తా, భార్గవమూర్తి, గుర్రప్పశెట్టి తదితరులు ఉన్నారు.

వెంకటగిరి పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

తిరుపతి క్రైమ్: వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక గృహహింస, వరకట్న వేధింపులు కేసులో నేరస్తుడికి జైలు శిక్ష పడడంతో ఆ కేసు నిరూపణకు కృషి చేసిన వెంకటగిరి పోలీసులు, ఏపీపీలను జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ అభినందించారు. 2017వ సంవత్సరంలో వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో శ్రీకాళహస్తి మండలం, అక్కుర్తి గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డిని ముద్దాయిగా నిర్ధారించి వెంకటగిరి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసు నిరూపణకు అహర్నిశలు కృషిచేసిన దర్యాప్తు అధికారి సుధాకర్ రెడ్డి, ఏపీపీ ప్రకృతి కుమార్, వెంకటగిరి సీఐ సంగమేశ్వర రావు, వెంకటగిరి పోలీస్ స్టేషన్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ సుందరయ్య, సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ మహమ్మద్ బాబా, సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ అభినందించారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండా

- యువతను ఆదరిస్తే శరవేగంగా అభివృద్ధి
- ఇక్కడే ఉద్యోగాలు వచ్చేలా ఐటీ కంపెనీలు తీసుకొస్తా
- తిరుపతి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- ఆత్మీయ సమావేశంలో భూమన అభినయ్‌రెడ్డి



జీవకోనలోని ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా పని చేస్తానని, యువతను ఆదరిస్తే శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని వైఎస్ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జీవకోనలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు ప్రసాద్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యువతరానికి వన్నెతెచ్చేలా తిరుపతి అభివృద్ధిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న యువనేత అభినయ్‌రెడ్డికి జీవకోన ప్రజలంతా మద్దతుగా ఉంటామని ముక్తకంఠంతో చెప్పారు. జీవకోనలో ఇంతగా రోడ్లు వస్తాయనుకోలేదని, మహా నగరాన్ని తలపించేలా సెంట్రల్ లైట్స్ ఏర్పాటుతో జీవకోన సుందరంగా మారిందని స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండడంతో ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. జగనన్న సహకారంతోనే తిరుపతి నగరాన్ని రూ. 1700 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగలిగామని చెప్పారు. తిరుపతి నగర ప్రజలు సినీగ్లామర్‌కు ఆకర్షితులు కాకుండా అభివృద్ధిని ఆకాంక్షించి తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభినయ్‌రెడ్డి కోరారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించగలమన్న నమ్మకాన్ని తాను నిలబెట్టానని సగర్వంగా చెప్పారు. తిరుపతి జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా అన్ని విధాల అభివృద్ధి చేశామన్నారు. తిరుపతిలో నిర్మించిన 22 మాస్టర్ ప్లాన్ రోడ్లు నగర రూపురేఖలే మార్చేశాయన్నారు. రాష్ట్రంలో జగనన్నను, తిరుపతిలో తనను ఆశీర్వదించాలని కోరారు. నాలుగున్నరేళ్లల్లో జగనన్న చేసిన మంచి చూశారని, తిరిగి అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తారని చెప్పారు. నగరాన్ని కూడా పరిశుభ్రమైన నగరంతోపాటు క్రైం ఫ్రీ సిటీగా కూడా మారుస్తానని హామీ ఇచ్చారు.



తిరుపతి జీవకోనలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరైన ప్రజలు

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



తిరుపతిలో పద్మావతీ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

- టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైమ్: జిల్లాలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్టు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి బాలికోన్నత పాఠశాలను సోమవారం ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడం చేశామని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకుండా పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వేయించామని, పరీక్ష పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు.



ఉపాధ్యాయులు, ఇన్విజిలేటర్లతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

ఉమెన్స్ వింగ్ నూతన కమిటీ ఎంపిక



నగర నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు భువనేశ్వరి

తిరుపతి కల్చరల్: ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ తిరుపతి నగర ఉమెన్స్ వింగ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆ సంస్థ ఉమెన్స్ వింగ్ జిల్లా అధ్యక్షురాలు బి.భువనేశ్వరి ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాణిపాకం మురళి, కె.రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై తిరుపతి నగర ఉమెన్స్ వింగ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షురాలిగా డి.సుబ్బమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎం .తులసి, ఫైనాన్స్ కార్యదర్శిగా యు.కల్పన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి, రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగర పరిధిలో అన్ని ప్రాంతాల ప్రజల సంక్షేమం దిశగా మెడికల్ క్యాంపులు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టి చేయూతనివ్వాలని కోరారు. నూతన కమిటీలను ఎంపిక చేసి మానవ హక్కులపై అవగాహన సదస్సులు చేపడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. తమ ఎంపికకు సహకరించిన జిల్లా, రాష్ట్ర కమిటీ ప్రతినిధులకు నూతనంగా ఎంపికైన నగర కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై శిక్షణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ గ్రంథాలయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీస్ ఆఫ్ కల్చర్ వారి సౌజన్యంతో వర్సిటీలో మంగళవారం నుంచి ఐదు రోజులపాటు పౌర గ్రంథాలయ నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.సురేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో ఆంధ్ర, తెలంగాణా, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన గ్రంథాలయ సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలియజేశారు.

20 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): కాకినాడ జిల్లా, పిఠాపురం శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 20 నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. 19న సాయంత్రం 6 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తారు. 20న ఉదయం 8 నుంచి 8.45 గంటల వరకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మార్చి 21న సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి గరుడ వాహన సేవ జరగనుంది. మార్చి 22, 23, 24 తేదీల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఊంజల్‌సేవ చేపడుతారు. మార్చి 25న ఉదయం 9 నుంచి 10.45 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 5 గంటలకు ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. మార్చి 26న సాయంత్రం 5.30 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి దర్శించుకున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తెలంగాణ ఎమ్మెల్సీ సుంకరరాజు, సినీనటి అనన్య దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



సినీనటి అనన్య

పొరపాట్లకు తావివ్వకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

- పూర్తి అవగాహన అవసరం
- సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహిద్దాం

తిరుపతి అర్బన్: పొరపాట్లు చేయడం, తర్వాత సరిదిద్దుకోవడం వద్దు.. ముందే పూర్తి అవగాహన ఉంటే తప్పులు లేకుండా సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించగలమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలింగ్ ప్రక్రియ విధులపై అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టర్‌తోపాటు జేసీ ధ్యాన్‌చంద్ర పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తప్పులు లేకుండా పనిచేస్తేనే బాధ్యతగా పనిచేసినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా లోటుపాట్లు లేకుండా పోలింగ్ విధులకు సిద్ధం కావాలని సూచించారు. ఈవీఎంల సీలింగ్ నుంచి మాక్ పోలింగ్ వరకు గత ఎన్నికల కంటే ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయని, వీటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని వెల్లడించారు. నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు సరైన అవగాహన ఉంటే కిందిస్థాయి ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు సక్రమంగా అవగాహన కల్పించగలుగుతారని చెప్పారు. భారత ఎన్నికల సంఘం అందించిన హ్యాండ్ బుక్‌ను తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఎన్నిక కూడా కొత్తగానే ఉంటుందని భావించి పోలింగ్ ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సిద్ధం కావాలన్నారు. ఈవీఎంల పనితీరు, వినియోగం, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల పరిశీలన, బ్యాలెట్ యూనిట్‌లో అభ్యర్థుల పేర్లకు ఎదురుగా ఓటరు నొక్కే బ్లూ బటన్లు ముందస్తు పరిశీలన మొదలైన పోలింగ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలు అప్పగించాల్సిన రిసెప్షన్ సెంటర్ వరకు చేపట్టాల్సిన ప్రతి అంశాన్ని క్లుప్తంగా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని అధికారులు సద్వినియోగం చేసుకొని ఎటువంటి పొరపాట్లు జరగకుండా సజావుగా పోలింగ్ నిర్వహించేలా వారి నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, ఎస్డీసీ మురళి, మాస్టర్ ట్రైనర్లు చంద్రమౌళి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాల మైదానంలో టీటీడీ సీనియర్ పురుష, మహిళ అధికారులకు వివిధ కేటగిరీలవారీగా నడక, బాల్ త్రో, బకెటింగ్ ది బాల్, షాట్ పుట్ తదితర పోటీలు నిర్వహించారు. రింగ్ ఆన్ ది స్టిక్ పోటీల్లో డిప్యూటీ ఈవోలు గోవింద రాజన్ ప్రథమ, సెల్వం ద్వితీయ, చీఫ్ పీఆర్ఓ డాక్టర్ టి.రవి తృతీయ స్థానాలు సాధించారు. ఒక కిలోమీటర్ వాక్ పోటీల్లో చంద్రశేఖర్ ప్రథమ, గోవిందరాజన్ ద్వితీయ, వెంకటేశ్వర్లు తృతీయ స్థానాలు సాధించారు. డాక్టర్ రేణు దీక్షిత్ ప్రథమ, రమాదేవి ద్వితీయ, డాక్టర్ కుసుమకుమారి తృతీయ స్థానాలు సాధించారు. షార్ట్ పుట్ పోటీల్లో పార్థసారథి ప్రథమ, పురుషోత్తం ద్వితీయ, మల్లికార్జున ప్రసాద్ తృతీయ స్థానాలు సాధించారు. డాక్టర్ రేణు దీక్షిత్ ప్రథమ, రమాదేవి ద్వితీయ, నారాయణమ్మ తృతీయ స్థానాలు సాధించారు. బాల్ త్రో పోటీల్లో లక్ష్మణ బాబు ప్రథమ, మల్లికార్జున ప్రసాద్ ద్వితీయ, భాస్కర్ రెడ్డి తృతీయ స్థానాలు సాధించారు. బకెటింగ్ ది బాల్ పోటీల్లో లక్ష్మణ్ బాబు ప్రథమ, రామ కోటేశ్వరరావు ద్వితీయ, పురుషోత్తం తృతీయ స్థానాలు సాధించారు. రమాదేవి ప్రథమ, స్నేహలత ద్వితీయ, నారాయణమ్మ తృతీయ స్థానాలు సాధించారు.

శాటిలైట్ ఫోన్లపై శిక్షణ

తిరుపతి మంగళం: టాస్క్ ఫోర్స్ సిబ్బంది కూంబింగ్ సమయంలో ఉపయోగించే శాటిలైట్ ఫోన్ల వినియోగంపై బీఎస్ఎన్ఎల్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ ఏజీఎం లక్ష్మీనారాయణ శాటిలైట్ ఫోన్ల పనితీరు, వాటిని ఎలా ఉపయోగించాలి, ఎలాంటి ప్రాంతాల్లో వినియోగించాలి, వాటి వల్ల కలిగే ప్రయోజనం తదితరాల పై శిక్షణ ఇచ్చారు. కూంబింగ్ చేపట్టే అధికారులతో గ్రూప్ డిస్కషన్ చేపట్టారు. కొన్ని కేస్ స్టడీలను తెలిపారు. తరువాత టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆపరేషనల్ టీమ్‌లతో ఇంటరాక్ట్ అయ్యారు. శాటిలైట్ ఫోన్ల ద్వారా కమ్యూనికేషన్ ఎలా తదితరాలను తెలిపారు. డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ ఐలు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు అవగాహన కలిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

భవన నిర్మాణాలకు బీఓసీ సెస్ కట్టాలి

- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిలో జమ చేయండి
- వెల్లడించిన జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: భవన నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ అప్రూవల్ అయితే తప్పకుండా కార్మికుల సంక్షేమ నిధికి 1శాతం బీఓసీ సెస్ కట్టాల్సిందేనని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కార్మిక శాఖ కన్వీనర్ ఎం.బాలునాయక్ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని విభాగాల ఇంజినీరింగ్ అధికారులు, పే అకౌంట్స్ ఆఫీసర్లు, వర్క్ ఎగ్జిక్యూటివ్ అధికారులు, ప్లానింగ్ అప్రూవల్ అథారిటీ అధికారులు, అడిషనల్ మున్సిపల్ కమిషనర్, పంచాయితీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ తదితరులు హాజరయ్యారు. వారికి డీఆర్వో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి 1శాతం బీఓసీ సెస్ చెల్లించాల్సిన అంశాన్ని వివరించారు. తప్పకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో శ్రీరామ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 28మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. టీవీఎస్–సుందరం లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఈసీఈ, ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిపారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచి రూ.2 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికకావడం సంతోషకరమన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రెటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ కె.జయచంద్ర, ప్లేస్‌మెంట్ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యాపకులు అభినందించారు.

భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదం

భాకరాపేట: భాకరాపేట ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గరికి గాయాలయ్యాయి. భాకరాపేట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నుండి దివ్యాంగుడు సురేష్ ఆరోగ్య పరిస్థితి బాగా లేక పోవడంతో కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి రుయా ఆసుపత్రికి ఆటోలో బయల్దేరాడు. మార్గమధ్యంలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో ఆటో అదుపు తప్పడంతో ఐదడుగులు లోయలోకి జారుకుంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న దివ్యాంగుడు సురేష్, చిన్నపాపమ్మ, మాధవి, ఆటో డ్రైవర్ రెడ్డిరాంతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దివ్యాంగుడు సురేష్ పరిస్థితి విషమంగా ఉంది. గాయపడ్డ వీరందరిని భాకరాపేట 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మోహన్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన భూమన



మంచు మోహన్‌బాబును సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: సినీ నటుడు, శ్రీవిద్యానికేతన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధినేత మంచు మోహన్‌బాబుకు టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దుశ్శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం శ్రీవిద్యానికేతన్‌లోని మోహన్‌బాబు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పక్కనే ఉన్న మోహన్‌బాబు తనయుడు సినీహీరో మంచు విష్ణును ఆత్మీయంగా పలకరించారు.

రైతు చెంతకు వ్యవసాయ విద్యార్థులు



బ్రాహ్మణపట్టులో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తిరుపతి రూరల్: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతుల చెంతకు వెళ్లారు. వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడో రోజు సోమవారం బ్రాహ్మణపట్టు గ్రామంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మినుములు, వేరుశనగ పంటలను, చీనీతోటలో అంతర పంటలను పరిశీలించారు. తెగుళ్లు, పేనుబంక, పురుగులను గుర్తించారు. నివారణ చర్యలను రైతులకు వివరించారు. అనంతరంగా పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు వీఎల్ఎన్ రెడ్డి, సరళ, వాణి, ప్రదీప్, యామిని, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

తిరుపతి అర్బన్: ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి అంతా సహకరించాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి సంబంధించి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈఆర్‌ఓలు హెచ్‌ఎం ధ్యానచంద్ర(ఐఏఎస్), అదితి సింగ్(ఐఏఎస్), కోదండ రామిరెడ్డి, చంద్రముని, నిషాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, రవిశంకర్ రెడ్డి, రాంమోహన్, పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మేలు జరిగింది.. మోహిత్‌ను ఆదరించండి

- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం
- తిరుచానూరులో మీతోనే.. మీ మోహిత్‌కు అపూర్వ ఆదరణ

చంద్రగిరి(తిరుచానూరు): 'జగనన్న ప్రభుత్వంలో ప్రజలు అందరికీ మేలు జరిగింది.. కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ అన్న తేడాలు లేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా వారి ఇంటికి చేరింది. అడగకుండానే అన్నీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయునిగా, జగనన్న స్ఫూర్తితో జనం ముందుకు వచ్చిన మోహిత్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించండి' అంటూ ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి విన్నవించారు. తిరుచానూరు పంచాయతీ లక్ష్మీనగర్ నుంచి 'మీతోనే..మీ మోహిత్' కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆమె ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మోహిత్ రెడ్డిని ఆదరించి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి పదేళ్లుగా చేసిన మేలును గుర్తు చేస్తూ ఆయన బిడ్డను గెలిపించేందుకు ముందుకు రావాలని కోరారు.

చంద్రగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.978 కోట్లతో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. చెవిరెడ్డి లక్ష్మీ చేస్తున్న విన్నపాలకు మహిళలు స్పందిస్తూ తప్పకుండా మోహిత్‌రెడ్డిని ఆశీర్వదిస్తామని, అడగకుండానే అన్నీ చేస్తూ ప్రజలందరి బాగోగులు చూసుకోవడంలో చెవిరెడ్డిని మించిన నాయకుడు లేడన్న నిజాన్ని మోహిత్‌రెడ్డి గెలుపుతో మరోసారి రుజువు చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో మోహిత్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పెద్ద ఎత్తున యువత చెవిరెడ్డి లక్ష్మి వెంట తిరుగుతూ కరపత్రాలను ప్రతి ఇంటికీ అందజేశారు



తిరుచానూరులో చెవిరెడ్డి లక్ష్మికి అపూర్వ స్వాగతం పలుకుతున్న మహిళలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, తిరుచానూరు సర్పంచ్ సతీమణి మధు తదితరులు



మోహిత్‌ను ఆశీర్వదించాలంటూ వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న చెవిరెడ్డి లక్ష్మీ

సంతలో ప్రజలకు ఎమ్మెల్యే భోజనాలు



భోజనాలు వడ్డిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో రైతులు, వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉచితంగా భోజనాలను అందజేశారు. సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా భోజనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారులు భోజనాలకు ఇబ్బందులు పడకూడదని, అందరూ బాగుండాలనే ఉద్దేశంతో రుచికరమైన భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. పాకాలతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు. అన్ని సమయాల్లో తమకు అండగా ఉండే ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని, రాబోయే ఎన్నికల్లో వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్: ఆస్తి కోసం ఒకరిని హత్య చేసిన కేసులో తిరుపతి జిల్లా, వడమాలపేట మండలం, పత్తిపుత్తూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఎస్.మునిశేఖర్‌కు ఏప్రిల్ ఒకటో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు సోమవారం ఆదేశాలు జారీచేశారు. టీటీడీ మాజీ ఉద్యోగి ఎస్.రఘురాం జనవరి 22న మృతి చెందాడు. ఆ మృతిపై అతని అన్న ఎం.ప్రభాకరుడు తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు ఎస్.మునిశేఖర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

జనరల్ మేనేజర్ పోస్టు నియామకం వాయిదా

తిరుపతి(అలిపిరి): ఎన్నికల కోడ్ కారణంగా టీటీడీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పోస్టు నియామకం వాయిదా వేస్తున్నట్లు టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు అధ్యక్షులు చీర్ల కిరణ్ తెలిపారు. ఈ నెల 20న జరగాల్సిన నియామకాన్ని ఎన్నికల అనంతరం చేపట్టనున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్ నం 9989033100, 9989759044లో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

భాకరాపేట: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు చిన్నగొట్టిగల్లు ఎంఈవో సత్యనారాయణ, ఎర్రావారిపాళెం ఎంఈవో బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం చిన్నగొట్టిగల్లు, భాకరాపేట కేంద్రాలుగా 207 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎర్రావారిపాళెం, నెరబైలు, బోడేవాండ్లపల్లె కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 267 మంది విద్యార్థులకు 261 మంది హాజరైనట్లు ఎంఈవో తెలిపారు. ఎర్రావారిపాళెం మండలంలో ఆరుగురు హాజరు కాలేదు.

చంద్రగిరిలో...

చంద్రగిరి: పదో తరగతి పరీక్షలు మండల వ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని 9 సెంటర్లలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 1165 మంది విద్యార్థులు కావాల్సి ఉండగా, 34 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ అధికారులు 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ లలిత కుమారి తెలిపారు.

రామచంద్రాపురం: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 9 గంటలకు అనుమతించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మార్కండేయ నాయుడు, జయవేలు మాట్లాడుతూ మండలంలోని 5 పరీక్షా కేంద్రాల్లో 426 మంది విద్యార్థులకు గాను 414 మంది హాజరైనట్లు చెప్పారు. కేకేవీపురంలో 47 మంది, కమ్మకండ్రిగలో 84 మంది, సొరకాయలపాలెంలో 126 మంది, కుప్పంబాదూరులో 79 మంది, నెత్తకుప్పంలో 78 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో కేకేవీపురంలో ఒకరు, కమ్మకండ్రిగలో ముగ్గురు, కుప్పంబాదూరులో ఒకరు, నెత్తకుప్పంలో ఒకరు, సొరకాయలపాలెంలో ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు.



పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పది పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

పాకాల: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎ, బి సెంటర్లు, దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో సి సెంటర్‌తో కలిపి మొత్తం 3 సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మూడు సెంటర్లలో 482 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు తెలిపారు.

అభ్యుదయ తత్వం అడిగోపుల కవిత్వం



నిలువెత్తు సంతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, వక్తలు

తిరుపతి కల్చరల్: అడిగోపుల వెంకటరత్నం అనర్ఘమైన అభ్యుదయ కవి రత్నమని తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రచయిత అడిగోపుల వెంకటరత్నం రచించిన నిలువెత్తు సంతకం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అంతరాలు, అసమానతలపై అడిగోపుల అసహనం ప్రకటిస్తారని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షురాలు ప్రేమావతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. కవిత్వం సమీక్షించడం సులభం కాదని, కవిత్వాన్ని పూర్తిగా అనుభూతి చెందిన తర్వాతే విమర్శ చేయగలమన్నారు. సామాన్యంగా కనిపించే వస్తువును కూడా జిగేలు మనిపించే రసవేది అడిగోపుల వెంకటరత్నం అని తెలిపారు. ఆయన ఇప్పటికి 29 కవితా సంపుటాలు ప్రచురించడం అరుదైన విషయమన్నారు. వెంకటరత్నం కవి మాత్రమే కాదు చిత్రకారుడు కూడా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రచయిత కుమారుడు శ్రీకాంత్, అవధాని ఆముదాల మురళి, పలువురు రచయితలు, కవులు, సాహితీ వేత్తలు టెంకాయల దామోదరం, ఆకుల మల్లేశ్వరరావు, ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు, నడ్డి నారాయణ, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

కోడ్ కూసింది... ముసుగు పడింది



చిగురువాడ పంచాయతీలో నేతల విగ్రహానికి తెల్లరంగు ముసుగు వేసిన దృశ్యం





పెరుమాళ్లపల్లిలో...

- ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అమలులోకి కోడ్
- అప్రమత్తమైన నియోజకవర్గ అధికార యంత్రాంగం
- నాయకుల విగ్రహాలకు ముసుగులు, ఫొటోల తొలగింపు

తిరుపతి రూరల్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నేతల ఫొటోలను తొలగించారు. వివిధ ప్రాంతాల్లో దర్శనమిస్తున్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లోని 108 సచివాలయాల పరిధిలో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి హెచ్చరించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఇప్పటికే ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తనిఖీల సమయాల్లో పోలీసులకు సహకరించాలని, ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని చంద్రగిరి డీఎస్పీ తెలిపారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పలు కూడళ్లలో నేతల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు ఫ్లెక్సీలను తొలగించారు. ఇప్పటికే భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, కరపత్రాలను, వాల్‌పోస్టర్లను ఆయా పార్టీల నాయకులు తొలగించుకోవాలని అధికారులు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో దుకాణాలపై పెట్టిన హోర్డింగ్‌లు తీసేయాలని సూచించారు.

89 రోజులపాటు కోడ్

దాదాపు 89 రోజులపాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. షెడ్యూల్ విడుదలైన శనివారం నుంచి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు 89 రోజులపాటు కోడ్ వర్తించనుంది. కోడ్ అమల్లోకి రాగానే అన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు తొలగించారు.

నియోజకవర్గంలో ఓటర్లు ఇలా...

చంద్రగిరి నియోజకవర్గంలో శనివారం నాటికి ఓటర్ల సంఖ్య 3,08,143కు చేరుకుంది. పోలింగ్ కేంద్రాలు 375 ఉన్నాయి. ఇక ఓట్ల తొలగింపు, బదిలీ, చేర్పులు, మార్పులకు అవకాశం లేదు. ఈమేరకు శనివారం ఈఆర్వో నెట్‌లో ఈ ప్రక్రియ నిలిపివేశారు. కొత్త ఓటు నమోదుకు ఫారం–6 దాఖలు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. నామినేషన్లు ఆఖరు తేదీ పది రోజుల ముందు వరకు దాఖలైన ఫారం–6 దరఖాస్తులను పరిష్కరించి, ఓటు హక్కు కల్పించనున్నారు. ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి ఓటు హక్కు కల్పిస్తారు.

ఇక్కడ ఎన్నికల నిబంధనలు పట్టవా?



నారావారిపల్లి ప్రవేశ మార్గంలో తొలగించని టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన బోర్డు



కందులవారిపల్లిలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తూ దర్శనమిస్తున్న బోర్డు

- ప్రభుత్వ ఆస్తులలో తొలగని టీడీపీ ప్రచార బోర్డులు
- నారావారిపల్లిలో యద్దేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

చంద్రగిరి: దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) నగారాను మోగించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్‌ను అధికారులు పక్కాగా నిర్వహించేందుకు సన్నాహాలను నిర్వహిస్తున్నారు. అయితే చంద్రగిరి మండలంలో మాత్రం ఎన్నికల కోడ్‌తో మాకేం పని అన్న చందంగా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. ప్రచార యావతో ఎన్నికల కోడ్‌ను సైతం విస్మరించి ప్రభుత్వ ఆస్తులతో ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆస్తులలో ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డులు ఉన్నప్పటికి అధికారులు వాటిని తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడెక్కడంటే... : మండల పరిధిలోని నారావారిపల్లి కాలనీ, నారావారిపల్లి, కందులవారిపల్లి హరిజనవాడ, కందులవారిపల్లి, శేషాపురం, భీమవరం, యల్లంపల్లి, మూలపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఆస్తులలో బోర్డులను టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. అయితే వాటిని తొలగించాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో నిబంధనలు గాల్లో దీపంలా మారాయి. దీనిపై ఎంపిడిఓను వివరణ కోరగా.. ఇప్పటికే ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పలు పార్టీలకు సూచించడం జరిందని తెలిపారు. స్వచ్ఛందంగా ఆయా పార్టీల బోర్డులను వారే తొలగించాలని, మంగళవారంలోపు తొలగించకుంటే తామే వాటిని తొలగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

జగనన్నతోనే జనరంజక పాలన



గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి

రామచంద్రాపురం: జగనన్న ప్రభుత్వంతోనే జనరంజక పాలన సాధ్యమైందని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చంద్రప్పనాయుడు కండ్రిగ, పిల్లారికోన, నెత్తకుప్పం హరిజనవాడలో మీతోనే మీ మోహిత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి మోహిత్‌రెడ్డిని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు బీకిరెడ్డి, చంద్రబాబు, యశ్వంత్, భాస్కర్ రాయల్, కేశవులు రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పాకాల: దామలచెరువుకు సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కొనుదుల నిశిత తన తండ్రి కొనుదుల చక్రధర్ సంస్మరణార్థం వృద్ధులకు భోజనాలను ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు విజయ్‌బాబు, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ జి.రామయ్య, ధనుంజయ పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

అభివృద్ధిని చూడండి... అన్నని గెలిపించండి



ప్రచారంలో పాల్గొన్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల: ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని, తన అన్నయ్య తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని దామలచెరువు పంచాయతీ ఎల్లంపల్లి, కట్టకిందపల్లి, కేశవ హరిజనవాడ, కొత్తపల్లి గాండ్లపల్లి, కొత్తపల్లి, కొత్తపల్లి ఒడ్డిపల్లి, కుక్కలపల్లి, కుక్కలపల్లి హరిజనవాడ గ్రామాల్లో గడపగడపకు పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి హర్షిత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని ప్రతీ గ్రామంలో జరిగిన అభివృద్ధిని ఆయన వివరించారు. నవరత్నాలతో ప్రజల్లో జీవితాల్లో వెలుగులు నింపారని, రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే మరొక్కసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని వివరివంచారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి అవసరాలను తీర్చారని పేర్కొన్నారు. తండ్రి బాటలో నడుస్తూ తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేస్తాడని, ప్రజలతోనే తన జీవితాన్ని కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా మోహిత్‌రెడ్డి పోటీ చేస్తున్నాడని, ఆయన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ లోకనాథం, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, పొలిటికల్ ఇన్‌చార్జ్ పులికేశవమూర్తిరెడ్డి, రఘుపతి, ఏఎంసీ చైర్మన్ లింగయ్య, ఎంపీటీసీ గౌతమి, డివిజన్ అధ్యక్షులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, గుండ్లూరి సురేష్, సర్పంచ్ సునిత, రహీం, జ్యోతిప్రసాద్‌రెడ్డి, రమేస్‌రెడ్డి, ఇమ్రాన్, కళావతి, ఖాజామస్తాన్, వినాయక, లోకేష్, సురేష్, హరీష్, అల్తాఫ్, మహ్మద్, మనోహర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.





